భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

30, సెప్టెంబర్ 2026, బుధవారం భారత్ సమాచార్

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. బుధవారం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి

మండల వ్యాప్తంగా ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలు అందించేలా సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విద్యా సంస్థల్లో పిల్లలకు వంట చేసే సిబ్బందికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని, సంబంధిత నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సంబంధించిన టీకాలను క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు.

మందులు, టీకాలు అందుబాటులో ఉంచాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ మెడిసిన్ రిజిస్టర్లు, అటెండెన్స్ రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్‌సెంటర్ల వారీగా అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులకు వ్యాక్సిన్లను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వేయాలని తెలిపారు.



బోదకాలు, గర్భసంచి క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

అనంతరం కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ప్రతి తరగతి గదిని పరిశీలించి విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. వారి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ ప్రతి సబ్జెక్టుపై జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని, ఈ దశలోనే భవిష్యత్తు కార్యాచరణకు బలమైన పునాది వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు శాతం పూర్తిగా నమోదయ్యేలా కళాశాల ప్రిన్సిపల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇంగ్లీష్‌తో పాటు ప్రతి సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానాన్ని పెంచి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ పర్యటనలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రవి రాథోడ్, నెల్లికుదురు తహసీల్దార్ చంద నరేష్, కళాశాల ప్రిన్సిపల్ కె. వీరస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. రమ్య తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar